సాక్షి
వికారాబాద్

మంగళవారం ¦ 4 ¦ మార్చి ¦ 2025



కించపరచడంతో..

తోటి విద్యార్థినుల ముందు అసభ్య పదజాలంతో దూషించడంతో ఓ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసింది. 10లో▸



గ్రామాల్లో నీటి కటకట

వేసవితాపం మొదలు కాకముందే గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొంది. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. 11లో▸



న్యూస్‌రీల్

యాదవ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడిగా పెంటయ్య



పెంటయ్యకు నియామకపత్రం అందజేస్తున్న రాములు తదితరులు

దుద్యాల్: యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడిగా దుద్యాల్ మండలం పోలేపల్లికి చెందిన పుర్ర పెంటయ్య యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం హైదరాబాద్‌లో సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు నియామక పత్రం అందజేశారు. అనంతరం పుర్ర పెంటయ్య మాట్లాడుతూ.. జాతీయ, రాష్ట్ర నాయకులు నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా యాదవుల హక్కుల కోసం పోరాడుతానని అన్నారు. కార్యక్రమంలో బోడుప్పల్ మున్సిపల్ మాజీ కార్పొరేటర్ జంగయ్య యాదవ్, రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీనివాస్ యాదవ్, నాయకులు మల్లేశ్, వీరేందర్, అంజి తదితరులు పాల్గొన్నారు.

దోర్నాల్‌లో వ్యవసాయ కళాశాల విద్యార్థుల పర్యటన



విద్యార్థులు వేసిన సామాజిక చిత్రపటాన్ని ఆసక్తిగా తిలకిస్తున్న రైతులు

ధారూరు: మండలంలోని దోర్నాల్ గ్రామంలో సోమవారం పాలెం వ్యవసాయ కళాశాల విద్యార్థుల క్షేత్ర పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఏరువాక కోఆర్డినేటర్, శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మణ్, శాస్త్రవేత్త యమున, ఏఈఓ సంజు రాథోడ్ గ్రామంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులతో కలిసి భాగస్వామ్య విశ్లేషణాత్మక కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని వనరులు, నేల రకాలు, వాటి స్వభావం, పండించాల్సిన పంటల గురించి వారు రైతులకు సలహాలు ఇచ్చారు. పంటల సాగు విధానం, పాటిస్తున్న మెళకువల గురించి వారు రైతులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు గ్రామంలోని రైతు కుటుంబాలను సర్వే చేసిన అనంతరం సామాజిక చిత్రపటాన్ని వేసి రైతులకు విపులంగా వివరించారు.

‘మోడల్’లో ప్రవేశాలకు గడువు పొడిగింపు

కుల్కచర్ల: మండలంలోని ముజాహిద్‌పూర్ మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు గడువు పొడిగించినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతి హెప్సిబా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్‌లో ప్రవేశాలకు ఈ నెల 10వ తేదీ వరకు గడువు ఉందన్నారు. 6 నుంచి 10వ తరగతి వరకు సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు మోడల్ స్కూల్ వెబ్ సైట్‌ను సందర్శించాలన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

జిల్లా గ్రంథాలయ శాఖ కార్యదర్శి సురేష్



చౌడాపూర్‌లో గ్రంథాలయం ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న సురేష్ తదితరులు

కుల్కచర్ల: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ శాఖ కార్యదర్శి సురేష్ అన్నారు. సోమవారం చౌడాపూర్ మండల కేంద్రంలో గ్రంథాలయ నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్‌తో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని దుద్యాల్, చౌడాపూర్ మండల కేంద్రాల్లో నూతన గ్రంథాలయాల నిర్మాణానికి ప్రతిపాదనలు రావడం జరిగిందని.. ఇందులో భాగంగా స్థల పరిశీలన చేశామన్నారు. విద్యార్థులు, యువత, నిరుద్యోగులకు గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో చౌడాపూర్ పంచాయతీ కార్యదర్శి రాజిరెడ్డి, నాయకులు మాసయ్య, రాము, శరత్‌కుమార్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

బైపాస్‌పై భద్రతేదీ..!

ప్రమాదకరంగా చెంగోల్ రోడ్డు

- ప్రాణాలు గాల్లో కలుస్తున్నా పట్టించుకోని అధికారులు
- వేగ నియంత్రణ చర్యలు చేపట్టాలని డిమాండ్



చెంగోల్ బైపాస్ రోడ్డు

తాండూరు రూరల్: బైపాస్ రోడ్డుపై భద్రత కరువైంది. ఈ రోడ్డు పనులు చాలా కాలంగా అసంపూర్తిగా ఉన్నాయి. నిత్యం ఈ మార్గంలో నాపరాయి రవాణా చేసే లారీలు పెద్ద సంఖ్యలో వెళ్తుంటాయి. కొంత మంది డ్రైవర్లు మద్యం తాగి వాహనాలను అతి వేగంగా నడపడం, వేగ నియంత్రణ చర్యలు చేపట్టకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

వ్యాపార కేంద్రంగా..

తాండూరు మండలం వ్యాపార కేంద్రంగా విరాజిల్లుతోంది. ఈ మండలంలో నాపరాతి గనులు, పాలిషింగ్ యూనిట్లు, సిమెంట్ పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయి. నిత్యం వివిధ ప్రాంతాలకు లారీల్లో నాపరాయి బండలు, సిమెంట్ బస్తాలను తరలిస్తుంటారు. గౌతాపూర్ నుంచి తాండూరు పట్టణంలోకి భారీ వాహనాలు వస్తుండటంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ సమస్య పరిష్కారానికి 2016లో అప్పటి ప్రభుత్వం రూ.78 కోట్లు మంజూరు చేసింది. తాండూరు, యాలాల మండలాలను కలుపుకొని బైపాస్ రోడ్డు నిర్మించాలని నిర్ణయించారు. గౌతాపూర్ సమీపంలో కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్ వెనుక నుంచి చెంగోల్ శివారు, భూకైలాస్ తండా, అంతారం, బషీర్‌మియా తండా నుంచి ఖాంజాపూర్ గేటు వద్ద తాండూరు– హైదరాబాద్ రోడ్డుకు బైపాస్ రోడ్డు అనుసంధానం అవుతుంది. అలాగే యాలాల మండలం కోకట్ శివారు నుంచి తాండూరు– కొడంగల్ రోడ్డు మార్గంలోని శ్రీనివాస రైస్ మిల్లు వద్ద బైపాస్ రోడ్డు అనుసంధానంగా నిర్మించారు. దీంతో భారీ వాహనాలు పట్టణం లోపల నుంచి కాకుండా బైపాస్ మీదుగా వెళ్లాయి. ప్రస్తుతం రోడ్డు విస్తరణ పనులు 70శాతం పూర్తయ్యాయి. అయితే కొంత మంది రైతులకు భూ పరిహారం చెల్లించక పోవడంతో అక్కడక్కడ పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. ప్రస్తుతం ఈ మార్గంలో కేవలం నాపరాతి లారీలు మాత్రమే వెళ్తున్నాయి.

చెంగోల్ మార్గం ప్రమాదం

బైపాస్ రోడ్డులోని చెంగోల్ రహదారి ప్రమాదకరంగా మారింది. ఈ గ్రామం మీదుగా నిత్యం ప్రజలు తాండూరుకు రాకపోకలు సాగిస్తుంటారు. నాపరాయి, ఎర్రమట్టి లారీలు అతివేగంగా వెళ్తుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. నాలుగు రోజుల క్రితం ఇదే చౌరస్తా వద్ద తండ్రీకొడుకులను లారీ ఢీకొనడంతో వారు మృతి చెందిన విషయం తెలిసిందే.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

చెంగోల్ చౌరస్తా, భూకైలాస్ తండా, అంతారం శివారు మీదుగా తాండూరు – సంగారెడ్డి ప్రధాన చౌరస్తా ఉంది. ఇక్కడ వేగ నియంత్రణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. చెంగోల్ – గౌతాపూర్ మార్గంలో సీసీ రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. అలాగే బైపాస్ వద్ద అటు ఇటు బారికేడ్లు ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఎప్పటినుంచో ఉంది.

డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు చేయాలి

ఓగిపూర్, కరన్‌కోట్, మల్కాపూర్, కోటబాసుపల్లి తోపాటు కర్ణాటక రాష్ట్రంలోని మిర్యాణ్ నుంచి నిత్యం నాపరాతి లోడ్‌తో లారీలు తాండూరు పట్టణానికి వస్తుంటాయి. కొన్ని లారీలు మాత్రం చెంగోల్ బైపాస్ మీదగా వెళ్తుంటాయి. లారీ డ్రైవర్లు మద్యం తాగి వాహనాలు నడుపుతుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.



ఇటీవల చెంగోల్ మార్గంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తండ్రీకొడుకులు

పొలానికి వెళ్లాలంటే..



చెంగోల్ – అంతారం తండా బైపాస్ రోడ్డు పక్కనే మా పొలం ఉంది. రోజూ పొలానికి వెళ్లాలి. నిత్యం పెద్ద సంఖ్యలో నాపరాతి లోడ్‌తో లారీలు బైపాస్ మీదగా వెళ్తుంటాయి. అతివేగంగా వెళ్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయమేస్తోంది. అధికారులు చొరవ తీసుకొని వేగ నియంత్రణ చర్యలు చేపట్టాలి.

– మహబూబ్, రైతు, చెంగోల్ గ్రామం

బాబోయ్ ఎండలు!

- జిల్లాలో ప్రచండ భానుడి భగభగలు
- 19 మండలాల్లో ఎల్లో అలర్ట్
- గరిష్ట ఉష్ణోగ్రత 39.8 డిగ్రీలుగా నమోదు
- ఉదయం 11 గంటల నుంచే వడగాల్పులు



బషీరాబాద్: జిల్లాలో ప్రచండ భానుడు ప్రతాపం చూపుతున్నాడు. ఉదయం 10 గంటల నుంచే భానుడు భగభగ మండుతున్నాడు. వారం రోజులుగా 38 డిగ్రీలుగా ఉన్న ఉష్ణోగ్రతలు సోమవారం జిల్లాలోని మర్పల్లి, బంట్వారం మండలాల్లో 39.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దోమలో కనిష్ఠ ఉష్ణోగ్రత 27 డిగ్రీలుగా రికార్డయ్యింది. ఈ సీజన్‌లో మొదటి సారి జిల్లాలోని 19 మండలాల్లోని 29 ప్రాంతాల్లో 35 నుంచి 40 డిగ్రీల లోపు ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో జిల్లా వాతావరణ శాఖ అధికారి అశోక్ ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ఉదయం 11 గంటలకే వడగాలులు ప్రారంభం కావడంతో జనం రోడ్లమీదకు రావడానికే భయపడుతున్నారు. మరోవైపు ఎండల తీవ్రతకు జనం శీతల పానీయాలకు ఎగబడుతున్నారు. పుచ్చకాయలకు గిరాకీ పెరిగింది.

ఉష్ణోగ్రతలు డిగ్రీలలో..

ప్రాంతం	గరిష్టం	కనిష్టం
మర్పల్లి	39.8	29.0
బంట్వారం	39.8	30.7
చౌడాపూర్	39.3	29.9
వికారాబాద్	39.0	26.1
యాలాల	38.6	26.5
తాండూరు	38.3	26.1
ధారూరు	38.1	29.3
పెద్దేముల్	38.0	27.7
మోమిన్‌పేట	37.9	31.8
పూడూరు	37.8	30.6
బషీరాబాద్	37.8	24.8
దౌల్తాబాద్	37.3	29.8
కోట్‌పల్లి	37.3	25.2
కుల్కచర్ల	37.1	29.6
కొడంగల్	37.1	21.8
నవాబుపేట	36.9	28.5
బొంరాస్‌పేట	36.6	24.6
దుద్యాల్	36.5	22.1
పరిగి	36.4	29.2
దోమ	35.4	27.0

ప్రజావాణికి 133 అర్జీలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

అనంతగిరి: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు ఇచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ ఆదేశించారు. సోమవా రం కలెక్టరేట్‌లో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం 133 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. వాటిని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తా మని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ వాసుచంద్ర, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఆలయ నూతన పాలకవర్గం సభ్యులతో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

ఆలయ అభివృద్ధికి కృషి

- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: పట్టణంలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా పార్థసారథి పంతులు, పాలక వర్గ సభ్యులుగా గోపాల్,సురేఖ,ఆలూరి నర్సింహులు, పాండ్య బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..గత ప్రభుత్వంఆలయ కమిటీ ఏర్పాటు చేయకుండా అడ్డుకుందని ఆరోపించారు. దేవాలయ అభివృద్ధిలో ప్రతి ఒక్క రూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పట్టణంలోని అతి పురాతన కిష్టమ్మగుళ్ల దేవాలయాన్ని పునర్నిర్మిస్తామని తెలిపారు. కుల్కచర్ల మండలం పాంబండ ఆలయాన్ని పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్ది రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు వచ్చే లా అభివృద్ధి చేస్తామన్నారు.శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 9,10,11వ తేదీల్లో నిర్వహించనున్నట్లు వివరించా రు.ప్రతి ఒక్కరూ ముందుండి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. పరిగి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. ట్రిపుల్ ఆర్ పరిగి నియోజకవర్గం మీదుగా వెళ్లేందుకు సీఎం రేవంత్ రెడ్డి కృషి చేశారన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తెస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, పార్టీ ప్ర ధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, వైస్ చైర్మన్ అయూబ్, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, దోమ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- జిల్లా వ్యాప్తంగా 29 కేంద్రాలు
- పరీక్షలు రాయనున్న 16,439 మంది విద్యార్థులు



తాండూరు పట్టణంలో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్ష కేంద్రం

తాండూరు: జిల్లా వ్యాప్తంగా ఇంటర్ పరీక్షలకు ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 5నుంచి పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లాలో 82 ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలు.. 16,439 మంది విద్యార్థులు ఉన్నారు. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లో 29 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలు పగడ్బందీగా నిర్వహించేందుకు 10 మంది కస్టోడియన్లు, రెండు ఫ్లయింగ్, రెండు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు, 29మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 29మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 12 మంది అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్లతో పాటు 800మంది ఇన్విజిలేటర్లను నియమించారు. ఫస్ట్ ఇయర్‌లో 7,914మంది విద్యార్థులు ఉండగా అందులో 6,418మంది జనరల్ కేటగిరి, 1,496మంది ఒకేషనల్ విభాగంలో పరీక్షలు రాయనున్నారు. ద్వితీయ సంవత్సరంలో మొత్తం 8,525 మంది విద్యార్థులున్నారు. జనరల్ విభాగంలో 5,589 మంది, ప్రైవేటు విభాగంలో 1,562 మంది, ఒకేషనల్ విభాగంలో 1,374 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు రావడానికి ఆర్టీసీ బస్సులను నడపనున్నారు. ఎండ తీవ్రత పెరిగిన నేపథ్యంలో పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, ఫ్యాన్లు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. విద్యుత్, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించనున్నారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు.

నిమిషం విధానం రద్దు

గతంలో పరీక్ష కేంద్రాలకు ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా విద్యార్థులను అనుమతించేవారు కాదు. ఈ విధానాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. అయితే 15 నిమిషాల ముందు వరకు కేంద్రాల్లోకి అనుమతిస్తారు.

ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు

ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్థుల సౌకర్యార్థం అధికారులు ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లను అందుబాటులో ఉంచారు. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం ఫీజుల కోసం హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న నేపథ్యంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. మీ సేవ కేంద్రాల్లో కూడా హాల్ టికెట్లు పొందవచ్చని అధికారులు తెలిపారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం



ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. విద్యార్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలి. ప్రభుత్వం ఒక్క నిమిషం ఆలస్యం విధానాన్ని రద్దు చేసింది. పరీక్షకు 15 నిమిషాల ముందు వచ్చినా కేంద్రంలోకి అనుమతిస్తారు.

– శంకర్‌నాయక్, ఇంటర్ జిల్లా నోడల్ ఆఫీసర్

ప్రతీ వారం తిరగలేకపోతున్నాం



డీఎస్పీ కార్యాలయం వద్ద లగచర్ల ఘటన బాధిత రైతులు

- త్వరగా చార్జిషీట్ వేయండి
- అధికారులను కోరిన లగచర్ల ఘటన బాధితులు

దుద్యాల్: గత ఏడాది నవంబర్ 11న దుద్యాల్ మండలం లగచర్ల గ్రామంలో అధికారులపై దాడి ఘటనలో నిందితులుగా ఉన్న వారు ప్రతి సోమవారం తాండూరు డీఎస్పీ కార్యాలయంలో హాజరవుతున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోలీసులు మాపై ఉన్న కేసులకు సంబంధించిన చార్జిషీట్‌ను కోర్టుకు అప్పగిస్తే వారం వారం డీఎస్పీ కార్యాలయానికి తిరిగే ఇబ్బందులు తప్పుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొంత మంది వయస్సు పైబడిన వారు, మహిళలు ఉన్నారని.. కూలి పనులు చేసుకుంటే తప్ప జీవనం సాగించలేరని పేర్కొన్నారు. ప్రతి వారం డీఎస్పీ కార్యాలయానికి తిరగాలంటే ఆర్థిక పరమైన ఇబ్బందులు పడుతున్నట్లు మహిళలు వాపోయారు. ప్రభుత్వం, పోలీసు అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని బాధిత రైతులు కోరారు. డీఎస్పీ కార్యాలయానికి వచ్చిన వారిలో ఏ–2 నిందితుడి సురేశ్ రాజ్, రాజు నాయక్, యాదయ్య, బుగ్గప్ప, శివకుమార్ తోపాటు మరో 13 మంది ఉన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించండి

తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న ఉమాశంకర్ ప్రసాద్

తాండూరు రూరల్: రెవెన్యూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని తాండూరు సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ ఆదేశించారు. సోమవారం తాండూరు తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ధరణి సమస్యలు పెండింగ్‌లో ఉంచరాదని అన్నారు. మహబూబ్‌నగర్ – చించోళి నేషనల్ హైవే పనుల్లో భాగంగా పాత తాండూరు మీదగా నిర్మిస్తున్న బైపాస్ రోడ్డుకు సంబంధించి రైతుల పరిహారం వెంటనే చెల్లించాలన్నారు. రోజువారి భూ రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కెతావత్ తారాసింగ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భార్యను తీసుకురావడానికి వెళ్తూ..

- రోడ్డు ప్రమాదంలో భర్త మృతి
- పెద్దేముల్ మండలంలో ఘటన



జైసింగ్ పవార్ మృతదేహం

తాండూరు రూరల్: పుట్టింటికి వెళ్లిన భార్యను తీసుకురావడానికి వెళ్లిన భర్త రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం మండలంలోని బాయిమీదితండాలో చోటుచేసుకుంది. పెద్దేముల్ ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. బాయిమీది తండాకు చెందిన శివరాం పవార్, చాందీబాయి దంపతుల కుమారుడు జైసింగ్ పవార్(22). కొన్నేళ్ల క్రితం శివారం పవర్ మృతి చెందాడు. ఏడాది క్రితం జైసింగ్ పవార్‌కు పాషాపూర్ తండాకు చెందిన అనితతో వివాహ జరిగింది. గత నెల అనిత పాషాపూర్‌లో గుడిపూజ ఉన్నందున పుట్టింటికి వెళ్లింది. ఆమెను తీసుకరావడానికి జైసింగ్ పవార్ బైక్‌పై పాషాపూర్‌కు బయలుదేరాడు. ఆదివారం రాత్రి 7 గంటల ప్రాంతంలో అడికిచెర్ల – పాషాపూర్ మధ్య గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో జైసింగ్ పవార్ మృతి చెందాడు. తల్లి చాందీభాయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. జైసింగ్ పవార్ మృతితో బాయిమీ ది తండా, పాషాపూర్ గ్రామాల్లో విషాదం నెలకొంది.

మగ్గం వర్క్‌పై ఉచిత శిక్షణ

ఇబ్రహీంపట్నం రూరల్: స్వర్ణ భారత్ ట్రస్ట్ ముచ్చింతల్‌లో మగ్గం వర్క్‌పై మహిళలకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ట్రస్ట్ డైరెక్టర్ జీఎస్ఆర్ కృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వర్ణ భారత్ ట్రస్ట్, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ సహకారంతో శంషాబాద్‌లో మార్చి 4నుంచి 30 రోజుల పాటు ట్రైనింగ్ ఇస్తామని పేర్కొన్నారు. 19నుంచి 45 సంవత్సరాల మధ్య వయసున్న వారు అర్హులని తెలిపారు. ఆధార్, రేషన్ కార్డుతోపాటు మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో హాజరు కావాలన్నారు. రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాలకు చెందిన గ్రామీణ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 7893121143, 9391487797, 9177141712 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

ఏసీబీ వలలో డీఈఈ

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ క్వాలిటీకం ట్రోల్ విభాగంలో డిప్యూటీ ఈఈగా పనిచే స్తున్న ఎ.దశరథ్ ముదిరాజ్ ఫైల్స్ క్లియర్ చేయడానికి, వాటిని ఈఈకి పంపించేందుకు ఒక వ్యక్తిని రూ:20వేలు డిమాండ్ చేసి, తీసు కుంటుండగా ఏసీబీ అధికారులు వల పన్ని పట్టుకున్నారు. లంచం సొమ్మును స్వా. దీనం చేసుకొని నాంపల్లి ఏసీబీ కేసుల కోర్టులో హా జరు పరిచారు. అడ్వాన్స్‌గా అం తకు ముందే రూ. 10వేలు తీసుకున్నట్లు ఏసీబీ పేర్కొంది.

మద్యం మత్తులో పురుగు మందు తాగి

వ్యక్తి మృతి

కొందుర్గు: తాగిన మైకంలో పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని తంగెళ్లపల్లిలో చోటుచేసుకుం ది. ఎస్ఐ రవీందర్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి రమేశ్(38) మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ సభ్యులు మందలిం చినా వినేవాడు కాదు. ఈ క్రమంలో సోమవారం ఉదయం పాడి పశువులకు పాలు తీయడానికి పొలానికి వెళ్లాడు. ఎంతకి తిరిగి రాకపోవడంతో అతడి తండ్రి చెన్నయ్య వెళ్లి చూసేసరికే పాక వద్దనే నురుగులు కక్కి అక్కడే పడి ఉన్నాడు. వెంటనే చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసు పత్రికి తరలించగా అప్పటికే రమేశ్ మృతి చెం దినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎన్టీఆర్ ఘాట్ వద్ద కారు బీభత్సం

రోడ్డు డివైడర్‌ను ఢీకొని ఫుట్‌పాత్ పైకి ఎక్కిన వాహనం

లక్డీకాపూల్ : నెక్లెస్ రోడ్‌లోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద ఓ కారు బీభత్సం సృష్టించింది. రోడ్డు డివైడర్‌ను ఢీ కొని ఫుట్‌పాత్‌పైకి దూసుకెళ్లిం ది. ఆ సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవ డంతో పెను ముప్పు తప్పింది. సోమవారం ఖైరతాబాద్ జంక్షన్ నుంచి సెక్రటేరియేట్ వైపు వెళుతున్న ఓ కారు అతివేగం కారణంగా ఎన్టీఆర్ ఘాట్ మలుపు వద్ద అదుపు తప్పిం ది. కారు డివైడర్‌పైకి దూసుకెళ్లి కరెంట్ పోల్‌ను ఢీకొనడంతో పోల్ రోడ్డుపై అడ్డంగా విరిగిపడింది. ఈ సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో విద్యుత్ స్తంభంతో పాటు రెండు చెట్లు ధ్వంస మయ్యాయి. కాగా కారు నడిపిన వ్యక్తి కూడా సురక్షితంగా బయటపడ్డాడు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న సైఫాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కారు నడిపిన వ్యక్తి మద్యం మత్తులో ఉన్నాడా అనే కోణంలో విచారణ చేపట్టారు. ప్రమాదం అనంతరం కారు డ్రైవర్ వాహనాన్ని అక్కడే వదిలేసి పారిపోయినట్లు సమాచారం.

ముసుగులు, సైకిల్ చైన్లతో బెదిరింపులు

బంజారాహిల్స్: ముసుగులు ధరించి సైకిల్ చైన్లు ఊపుకుంటూ హోటల్‌కి ప్రవేశించిన ఆగంతకులు కస్టమర్లను బెదిరింపులకు గురి చేస్తూ గదులు ఖాళీ చేసి వెళ్లిపోవాలంటూ హెచ్చరికలు జారీ చేసిన ఘటనలో నిందితు లపై బంజారాహిల్స్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. జూబ్లీహిల్స్‌కు చెందిన సుజాహత్ హుస్సేన్ (38) 2015లో బంజారాహిల్స్ రోడ్ నెం బర్-4లోని బగ్గా హోటల్స్‌ను లీజుకు తీసుకు న్నాడు. 2030 వరకు ఈ లీజు గడువు ఉండగా బగ్గా హోటల్స్ యజమానులు సత్పాల్‌సింగ్ బగ్గా, బల్వీందర్ బగ్గా మధ్య అద్దె విషయం లో గొడవలు వచ్చాయి. ఈ విషయంలో కోర్టులో కేసు నడుస్తుంది. ఇదిలా ఉండగా ఆదివారం రాత్రి 10 మంది ఆగంతకులు ముఖాలకు ముసుగులు ధరించి హో టల్‌లోకి ప్రవేశించి రిసెప్షనిస్ట్ సుభాన్‌ను బెదిరించి అక్కడి ను ంచి వెళ్లిపోవాల్సిందిగా హెచ్చరిం చారు. అలాగే కస్టమర్లు ఉన్న గదుల వద్దకు వెళ్లి సైకిల్ చైన్లు ఊపుకుంటూ ఖాళీ చేసి వెళ్లి పోవాలంటూ బెదిరింపులకు గురిచేశారు. రిసెప్షనిస్ట్ ఇచ్చిన సమాచారం మేరకు అక్కడకు చేరుకున్న సుజాహత్ డయల్ 100కు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునే లోపే ముసుగులు ధరిం చిన వ్యక్తులంతా అక్కడి నుంచి పరార య్యారు. సత్పాల్‌సింగ్ బగ్గా, బల్వీందర్‌సింగ్ బగ్గా ఇద్ద రూ హోటల్‌లోకి రౌడీలను పంపిం చారని, భయభ్రాంతులకు గురిచేశారని, విధ్వంసం సృష్టించారని, మెటీరియల్ ధ్వం సం చేశారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొ న్నాడు. బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయులు కించపరచడంతో..

పాఠశాల మొదటి అంతస్తు నుంచి దూకిన విద్యార్థిని

- కాలికి ఫ్యాక్చర్
- ఆలస్యంగా వెలుగులోకి..
- సిబ్బందిని నిలదీసిన తల్లిదండ్రులు
- విద్యార్థినితో ఫోన్‌లో మాట్లాడిన స్పీకర్ ప్రసాద్‌కుమార్


తబితతో మాట్లాడుతున్న రమేష్‌కుమార్


కాలికి కట్టుతో విద్యార్థిని తబిత

అనంతగిరి: తోటి విద్యార్థినుల ముందు సూటిపోటీ మాటలు తిడుతూ అసభ్య పదజాలంతో దూషిం చడంతో ఓ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మర్పల్లి మండలం కొత్లాపూర్‌కు చెందిన యాదయ్య కూతురు తబిత వికారాబాద్ పట్టణంలోని కొత్తగడి బాలికల సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. కొంత కాలంగా పాఠ శాల ఉపాధ్యాయురాళ్లు ప్రవంతి, సంధ్య విద్యార్థిని తబితను కించపరిచేలా మాట్లాడుతూ వస్తున్నారు. తీవ్ర మనోవేదనకు గురైన బాలిక ఈ నెల 24వ తేదీ మధ్యాహ్నం పాఠశాల మొదటి అంతస్తు పైనుంచి దూకింది. దీంతో తబిత కాలుకు ఫ్యాక్చర్ అయ్యిం ది. ఈ విషయం బయటికి పొక్కకుండా స్కూల్ సిబ్బంది తబితకు వికారాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. మెట్లపైనుంచి బాలిక జారిపడిందని తల్లిదండ్రులకు చెప్పి పంపిం చారు. సోమవారం ఉదయం ఉపాధ్యాయుల వేధింపుల గురించి సోషల్ మీడియాలో రావడంతో తల్లిదండ్రులు జరిగిన విషయాన్ని తెలుసుకుని వికారాబాద్‌లోని పాఠశాల వద్దకు వచ్చారు. మా అమ్మాయి పట్ల ఎందుకు అలా ప్రవర్తించారని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను నిలదీశారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే మా దృష్టికి తేవాలి కానీ మానసికంగా హింసించడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపట్ల ఉపాధ్యాయుల తీరు సరిగ్గా లేకపోవడం వల్లే ఇలా చేశానని బాధిత బాలిక తెలిపింది.

ఏబీవీపీ నాయకుల ఆందోళన

ఈ విషయం తెలుసుకున్న ఏబీవీపీ నాయకులు పాఠశాల వద్దకు చేరుకుని తల్లిదండ్రులతో కలిసి ఆందోళనకు దిగారు. ఉపాధ్యాయులపై ఎంతో నమ్మకంతో తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలకు పంపుతారని, ఇలా చేయడం దారుణమన్నారు. ఈ ఘటనకు కారణమైన వారిపై తగిన చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని సముదాయించే ప్రయత్నం చేశారు.

విద్యార్థినితో ఫోన్‌లో మాట్లాడిన స్పీకర్

ఈ విషయం స్పీకర్ ప్రసాద్‌కుమార్ దృష్టికి రాగానే ఆయన మున్సిపల్ వైస్‌చైర్మన్ మాజీ చిగుళ్లపల్లి రమేష్‌కుమార్‌ను స్కూల్ వద్దకు పంపారు. రమేష్ కుమార్ బాధిత విద్యార్థిని, ఆమె తల్లిదండ్రులతో మాట్లాడారు. ఇందుకు సంబంధించిన వివరాలను స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు ఫోన్‌లో తెలియజేశారు. అనంతరం ప్రసాద్‌కుమార్ సదరు విద్యార్థిని తబి తతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఘటనపై విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారు. మరోసారి ఇలాంటివి చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. దీంతో తబిత, ఆమె తల్లిదండ్రులు శాంతించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇలాంటివి పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అక్బర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

ఉపకరణాల శిబిరాన్ని.. సద్వినియోగం చేసుకోవాలి

ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి


శిబిరంలో వివరాలు సేకరిస్తున్న ఉమాహారతి

అనంతగిరి: దివ్యాంగుల కోసం నిర్వహిస్తున్న ఉప కరణాల ఎంపిక శిబిరాన్ని సద్వినియోగం చేసుకో వాలని ట్రైనీ కలెక్టర్, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి ఉమాహారతి అన్నారు. మహిళా శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖలు, సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ, భారత కృత్రిమ అవయవాల నిర్మాణ సంస్థ (ఆలింకో)ల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం వికారాబాద్‌లోని ధర్మ విద్యాలయంలో శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ.. శిబిరానికి వచ్చే దివ్యాంగులు సదరం సర్టిఫికెట్, బీపీఎల్ రేషన్ కార్డ్, యూడీఐడీ, ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకరావాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏడీపీ పథకం కింద అర్హులైన దివ్యాంగులకు ఉచితంగా సహాయక ఉపకరణా లు(బ్యాటరీ వీల్ చైర్, మోటార్ ట్రై సైకిల్, హ్యాం డ్ ప్రొపైల్డ్ ట్రై సైకిల్స్, వీల్ చైర్స్) అందజేస్తుం దని తెలిపారు. 40 శాతం వైకల్యం ఉన్నవారు అర్హులన్నారు. మొదటిరోజు 108 మంది దివ్యాంగులు ఉపకరణాల కోసం దరఖాస్తు చేసు కున్నట్లు తెలిపారు. మరో రెండు రోజులు శిబిరం కొనసాగుతుందని వివరించారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని దివ్యాంగులు సద్వినియోగం చేసుకో వాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ జహీరుద్దీన్, రాములు, ఆలింకో ప్రతినిధులు, మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

దైవ చింతనతో మానసిక ప్రశాంతత


బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

- కాకునూర్‌లో అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలు

కేశంపేట: దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే షాద్‌నగర్ వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని కాకునూర్ మహా లింగేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగం గా సోమవారం అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడాతూ.. గ్రామీణ ప్రాంతాల సం స్కృతి, సంప్రదాయాలకు ఇలాంటి పోటీలు అద్దం పడుతాయని తెలిపారు. ఆలయానికి త్వరలోనే రోడ్డు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. పోటీల్లో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన పోటీదారులు తలపడ్డారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, కాంగ్రెస్ మండల అధ్య క్షుడు గూడ వీరేశ్, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాల, నాయకులు శ్రావణ్‌రెడ్డి, శ్రీధర్ రెడ్డి, పల్లె ఆనంద్‌కుమార్, గిరియాదవ్, తైద పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించండి


ఎమ్మెల్యే సబితారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వాటర్‌మెన్‌లు, ఎలక్ట్రీషియన్‌లు

ఎమ్మెల్యే సబితారెడ్డికి విన్నవించిన మీర్‌పేట కార్పొరేషన్ సిబ్బంది

మీర్‌పేట: తమకు ఈఎస్ఐ సౌకర్యంతో పాటు పీ ఎఫ్ అందేలా చొరవ తీసుకోవాలని మీర్‌పేట కార్పొరేషన్ వాటర్‌మెన్‌లు, ఎలక్ట్రీషియన్‌లు సోమ వారం మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు క్యాంపు కార్యాలయంలో విన తిపత్రం అందజేశారు. నాలుగేళ్లుగా పీఎఫ్ అందక ఇబ్బందులు పడుతున్నామని, ఈఎస్ఐ కార్డులు సైతం జారీ చేయడం లేదని సిబ్బంది ఎమ్మెల్యే దృ ష్టికి తీసుకొచ్చారు. దీంతో పాటు ఐదేళ్లుగా యూని ఫారంలు, మున్సిపాలిటీ నుంచి రావాల్సిన సరు కులు ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నా రని, ఎన్నోసార్లు వినతిపత్రాలు సమర్పించినా న్యాయం జరగడం లేదని మొర పెట్టుకున్నారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ పది రోజుల్లోగా సిబ్బంది సమ స్యలను పరిష్కరించాలని కమిషనర్ జ్ఞానేశ్వ ర్‌ను ఆదేశించారు. పారిశుద్ధ్య సిబ్బంది లాగే వా టర్‌మెన్‌లు, ఎలక్ట్రీషియన్లకు అన్ని సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు. సిబ్బంది సురేంద ర్‌యాదవ్, యాదగిరి, భిక్షపతి, జంగ య్య, దశ రథ, రమేశ్‌రెడ్డి, వెంకటేశ్, మాజీ కార్పొ రేటర్ అని ల్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మాడ్గుల: ప్రభుత్వ అనుమతి లేకుండా అక్ర మంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసు కుంటామని మాడ్గుల సీఐ వేణుగోపాల్ రావు తెలిపారు. సోమవారం పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా అందుగుల వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలిం చారు. డ్రైవర్లు, యాజమనులపై కేసులు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

9 కిలోల గంజాయి పట్టివేత

ఇద్దరి నిందితుల అరెస్టు

చేవెళ్ల: గంజాయి రవాణా చేస్తున్న ముఠాను చేవెళ్ల పోలీసులు చాకచక్యంగా అదుపులోని తీసుకున్నారు. చేవెళ్ల సీఐ భూపాల్‌శ్రీధర్, డిటెక్టివ్ సీఐ సీహెచ్ ఉపేందర్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కేసారం గ్రామ సమీపంలో బైపాస్ రోడ్డు పక్కన నలు గురు అనుమానిత వ్యక్తులు ఆదివారం రాత్రి ఓ వ్యాగనర్ కారు, స్కూటీపై ఆగి ఉండటం కనిపించారు. అటువైపు వెళ్తున్న పెట్రోలింగ్ పోలీసులు ఎస్ఐ వనం శిరీష టీమ్‌తో వారి వద్దకు వెళ్లగా పారిపోయేందుకు ప్రయత్నిం చటంతో వెంబడించి ఇద్దరిని పట్టుకున్నారు. మరో ఇద్దరు పరారయ్యారు. వాహనాలను తనిఖీ చేయగా రెండు బ్యాగులలో 9 కిలోల గంజాయి ప్యాకెట్లు లభ్యమైంది. దీంతో వారికి అరెస్టు చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వ్యక్తులు ఏపీలోని రాజమండ్రికి చెందిన గోబెరు వెంకట చైతన్య అలియాస్ షేక్ రిజ్వాన్‌గా గుర్తిం చారు. మరో వ్యక్తి కూరెళ్ల సాయిఅరుణ్ నగ రంలోని ఉప్పల్‌లో ఉంటూ క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పారిపోయిన నిందితులు సూర్యాపేటకు చెందిన షేక్ అబ్బాస్, గణేశ్ లుగా గుర్తించినట్లు విచారణలో చెప్పారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసు కొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులకు గాయాలు

కేశంపేట: బైక్ పైన వెళ్తున్న తండ్రీకొడుకు లను బొలెరో వాహనం ఢీకొన్న సంఘటన మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామ శివారులో చోటుచేసుకుంది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... అల్వాల గ్రామ పరిధిలోని తులవానిగడ్డకు చెందిన రంగయ్య, తన కుమారుడు ఉజ్వ ల్‌తో ఆదివారం ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామానికి హెర్ కటింగ్ కోసం వెళ్లాడు. తిరిగి వస్తుం డగా బీఎస్ఆర్ పెట్రోల్ పంపు దగ్గర బొ లెరో వాహనం వీరి బైక్‌ను ఢీకొంది. దీంతో తండ్రీ కొడుకులకు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను శం షాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలిం చారు. సోమవారం రంగయ్య పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరహరి తెలిపారు.

క్రీడల్లోనూ రాణించాలి

ఓఎన్‌జీసీ అధికారి శంకర్‌నాయక్


మాట్లాడుతున్న శంకర్ నాయక్

కొత్తూర్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడాల్లో రాణించి, ఉన్నత శిఖరాలకు చేరుకో వాలని అంతర్జాతీయ అథ్లెట్, ఓఎన్‌జీసీ అధికారి శంకర్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం యూత్ క్లబ్ ఆవశ్యకతపై విద్యా ర్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్ర మంలో పాల్గొన్న శంకర్‌నాయక్ మాట్లాడు తూ.. క్రీడలపై అభిరుచి పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమం లో ఎంఈఓ అంగూర్‌నాయక్, ఉపాధ్యా యులు రవికుమార్, రాజు, బాలప్రసాద్, పీఈటీ నవనీత తదితరులు పాల్గొన్నారు.

మండి హోటళ్లలో తనిఖీలు

ఫ్రిజ్‌లలో మాంసం నిల్వలపై అధికారుల ఆగ్రహం


అబూద్ మండి హోటల్‌లో బిర్యానీకి వినియోగిం చే నూనెను పరిశీలిస్తున్న అధికారులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధి ఎర్రకుం టలోని మండి హోటళ్లలో కమిషనర్ వెంకట్రామ్ సోమవారం తనిఖీలు చేపట్టారు. బాలాపూర్ ఎస్ఐ షేక్ యూసుఫ్ జానీతో కలిసి ఆయన అల్-సవూద్ బైతల్ మండి, అబూద్ మండి హోటళ్లలో కిచెన్ రూమ్‌లో పరిశీలించగా అపరిశుభ్రమైన వాతావ రణం కనిపించాయి. ఈ రెండింటిలో ఫ్రిజ్‌లలో నిల్వ ఉంచిన చికెన్, మటన్, చేపలను చూసి కమిష నర్ యజమానులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మొదటిసారి హెచ్చరిక చేస్తున్నామని, మరోసారి తనిఖీ చేపడుతామని, పరిస్థితిలో మార్పు లేకుండా రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు జరిమానా విధి స్తామని హెచ్చరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కొందరు హోటల్ నిర్వాహకులు వ్యాపారమే ధ్యేయంగా పెట్టుకొని, నాణ్యమైన ఆహారాన్ని అందించడం లేదన్నారు. ముఖ్యంగా ప్రతి హోటల్ నిర్వాహకుడు శుచి శుభ్రత పాటించ డంతో పాటు వ్యర్థ నీటిని రోడ్లపై విడవరాదని సూచించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ మేనే జర్ జ్యోతి, పర్యావరణ అధికారి ఎం.శ్రీను, బిల్ కలెక్టర్ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య

గచ్చిబౌలి: ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఉరివేసుకుని ఆత్మ హత్యకు పాల్పడిన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకన్న కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా, తోర్‌మామిడికి చెం దిన కమలాపురం దేవిక(25) మాదాపూర్‌లోని ఓ ఐటీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తోంది. మంచిర్యాల మార్కెట్ రోడ్డుకు చెందిన సద్గుర్తి శరత్ చంద్రతో ఏర్పడిన పరిచయం ప్రేమకు దారితీయ డంతో పెద్దల అంగీకారంతో వారిరువురు గత ఆగస్టు 23న గోవాలో పెళ్లి చేసుకున్నారు. రాయదు ర్గంలోని ప్రశాంత్‌హిల్స్‌లో నివాసం ఉంటున్నారు. కొద్ది రోజులుగా భార్యా భర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం రాత్రి కూడా వారి మధ్య గొడవ జరగడంతో దేవిక గదిలోకి వెళ్లి గడియ పెట్టుకుంది. బయటికి వెళ్లి తిరిగి వచ్చిన శరత్‌చంద్ర తలుపు తట్టినా దేవిక స్పందించకపో వడంతో నిద్రపోయి ఉంటుందని భావించాడు. సోమవారం ఉదయం 10 గంటలైనా దేవిక బయటికి రాకపోవడంతో అనుమానం వచ్చిన శరత్ చంద్ర తలుపు విరగ్గొట్టి చూడగా ఆమె ఉరి వేసుకుని కనిపించింది. ఇరుగు పొరుగు సహాయం తో కిందకు దించి చూడగా అప్పటికే మృతి చెందిం ది. వర కట్నం కోసం శరత్‌చంద్ర తన కుమార్తెను వేధిస్తున్నాడని, ఈ కారణంగానే ఆమె ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని మృతురాలి తల్లి రామలక్ష్మి రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్ప త్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానమే.. పెనుభూతమై

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం రూరల్: కుటుంబ కలహాలతో జీవితం పై విరక్తి చెందిన ఓ వ్యక్తి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహ త్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టే షన్ పరిధిలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఆదిబట్ల మున్సిపాలి టీలోని ఎంపీపటేల్‌గూడకు చెందిన పట్నం నరేశ్‌కి పన్నెండేళ్ల క్రితం ఉమాతో వివాహమైంది. వీరికి కుమా రుడు, కుమార్తె ఉన్నారు. సాఫీగా సాగుతున్న కాపురం లో అనుమానం పెనుభూతంగా మారింది. దీంతో భార్యాభర్తలు నిత్యం గొడవలు పడుతుండేవారు. ఐదు నెలల క్రితం నరేశ్(36) మద్యం తాగి భార్యను కొడుతున్నాడని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అమ్మగారింటికి వెళ్లిపోవడంతో రెండు నెలల క్రితం పెద్దలు ఒప్పించి కాపురం చేయించారు. ఆదివారం రాత్రి 10 గంటలకు మళ్లీ భార్యాభర్తలు గొడవ పడడం తో 100 ఫోన్ చేశారు. పోలీసులు ఇంటికి చేరుకొని నచ్చజెప్పి గొడవ లేకుండా ఉండాలని సముదాయిం చారు. భార్య ఇద్దరు పిల్లలను పడక గదిలోంచి బయ టకు పంపించి నరేశ్ తలుపు వేసుకున్నాడు. సోమ వారం ఉదయం గది నుంచి ఉలుకుపలుకు లేకపోవడం తో భార్యకు అనుమానం వచ్చి డోర్ కొట్టడంతో తలుపు తీయలేదు. దీంతో పక్కింటివారు తలుపు పగలగొట్టి చూడగా నరేశ్ మృతదేహం ఫ్యాన్‌కు వేలాడుతుంది. దీంతో భార్య ఉమా బోరున విలపించింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాల్‌రాజ్ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వ హించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నిర్లక్ష్యానికి ప్రాణం బలి

- బైక్‌ను ఢీకొట్టిన కారు
- అక్కడికక్కడే వ్యక్తి మృతి
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు


జంగయ్య (ఫైల్)


ఆగాపల్లివద్ద ప్రమాదంలో గాయాల పాలైన పార్వతమ్మ, అశ్విత

మంచాల: ఓ వ్యక్తి నిర్లక్ష్యం నిండు ప్రాణాన్ని బలితీసు కుంది. అతివేగంతో ప్రయాణిస్తున్న కారు ఎదు రుగా వస్తున్న బైక్‌ను ఢీకొ ట్టింది. ఈ ఘటన నాగార్జు నసాగర్- హైదరాబాద్ మార్గంలో సోమవారం ఆగాపల్లి వద్ద చోటుచేసుకుంది. మంచాల ఎస్ఐ సతీష్‌కుమార్ వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా మర్రిగూడ మండలం ఎరగండ్లపల్లికి చెందిన మైలారం జంగయ్య(27) డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబంతో కలిసి నగరంలో నివాసం ఉంటు న్నాడు. ఈక్రమంలో సోమవారం భార్య పార్వ తమ్మ, కూతురు అశ్వితతో కలిసి స్వగ్రామం నుంచి బైక్‌పై హైదరాబాద్ వెళ్తున్నాడు. ఆగాపల్లి సమీపం లోని జేబీ వెంచర్ వద్దకు రాగానే నిర్లక్ష్యంగా కారు నడిపిన కోవూరి నర్సింగ్‌రావు ఎదురుగా వస్తున్న వీరి బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో జంగయ్య అక్కడికక్కడే మృతిచెందగా పార్వతమ్మ, అశ్వితకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన జం గయ్య ఆకస్మిక మృతితో బాధిత కుటుంబం రోడ్డున పడింది.

పాత లేఔట్లలోనే కబ్జాల జోరు

హైడ్రా ప్రజావాణిలో 49 ఫిర్యాదులు

సాక్షి, సిటీబ్యూరో: రాజధానిలోని వివిధ ప్రాం తాల్లో ఉన్న పాత లేఔట్లలోనే కబ్జాలు ఎక్కువగా జరుగుతున్నాయి. తమ ప్లాట్లతో పాటు ప్రజావస రాలకు ఉద్దేశించిన పార్కులు, రహదారులను కబ్జా చేసేస్తున్నారంటూ ఆయా లేఔట్లకు చెందిన పలు వురు హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీకి (హైడ్రా) ఫిర్యాదు చేస్తున్నారు. కమిషనర్ ఏవీ రంగనాథ్ సోమవారం నిర్వహిం చిన ప్రజావాణిలో మొత్తం 49 ఫిర్యాదులు రాగా... అత్యధికం వీటికి సంబంధించినవే ఉన్నాయి. 1980-90 దశకాల్లో వేసిన లేఔట్లను మాయం చేసి, ఆ స్థలాన్ని తమ ఆధీనంలోకి తీసుకుంటున్న కబ్జారాయుళ్లు మళ్లీ విక్రయాలకు యత్నిస్తున్నారం టూ బాధితులు రంగనాథ్ దృష్టికి తీసుకెళ్లారు. భూములకు ధరలు అమాంతం పెరగడంతో గతం లో తమకు అమ్మిన వాళ్లే కబ్జాలకు పాల్పడుతు న్నారని వాపోయారు. పంచాయతీ లేఔట్లను వ్యవ సాయ భూములుగా మార్చేసి సాగు చేసుకుంటు న్నారనీ హైడ్రాకు కొన్ని ఫిర్యాదులు అందాయి. వీటిపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందిస్తూ ఫిర్యాదుదారుల సమక్షంలోనే గూగుల్ మ్యాప్‌లు, సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్‌లను పరిశీలించారు. వాటిలో లభించిన సమాచారం ఆధారంగా సమగ్ర విచారణకు అధికారులను ఆదేశించారు. ప్రజా అవసరాలకు ఉద్దేశించిన స్థలాలను కాపాడు తామని కమిషనర్ హామీ ఇవ్వడంతో పలువురు సంతోషం వ్యక్తం చేశారు.

- రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం నాదర్ గుల్ గ్రామంలో 1980 దశకంలో 2684 ప్లాట్లతో చాణక్యపురి లేఔట్ వేశారు. గత ఏడాది అం దులోని 30 ఎకరాలు కబ్జాకు గురైనట్లు పలువురు ఫిర్యాదు చేశారు. అందులోని పార్కులు, రహదారులు కూడా కనుమరుగ య్యాయని ఆరోపించారు.
- రంగారెడ్డి జిల్లా పోచారం మున్సిపాలిటీ పరి ధిలోని సర్వే నం.58, 59లో ఉన్న ఎస్ఎంఆర్-ది వ్యానగర్ లేఔట్‌లో తాము ప్లాట్లు కొన్నామని, ఇప్పుడవి కనిపించట్లేదని యజమానులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఇలా 66 ప్లాట్లు గల్లంతయ్యాయని, ఇప్పుడు అక్కడ వ్యవ సాయం చేస్తున్నారని వాపోయారు.
- గచ్చిబౌలిలోని గోపన్నపల్లిలోని టీఎన్‌జీవో కాలనీలో ఉద్యోగులకు కేటాయించిన భూములు ఉన్నాయి. వీటిలో ఎనిమిది ఎకరా లను కొందరు కబ్జా చేసి ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేశారు. దీనిపై టీఎన్‌జీవో కాలనీ సంక్షేమ సంఘం (గచ్చిబౌలి) ప్రతినిధులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు.
- మేడ్చల్ జిల్లా చెంగిచర్ల గ్రామంలోని సర్వే నం.7, 10లో వేసిన శ్రీపురం కాలనీలో పా ర్కులు, రహదారులు కబ్జాకు గురయ్యాయని కా లనీ అసోసియేషన్ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు.


దరఖాస్తులు పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్